RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in




సంపుటి -13 సంచిక - 454 | 22 శనివారం ఆగస్టు 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

## జనసేన తెలంగాణ అధికార ప్రతినిధిగా డాక్టర్ శ్రీనివాసరావు నియామకం



జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా తెలంగాణ రాష్ట్ర ప్రజారోగ్య శాఖ మాజీ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు జనసేన పార్టీ నాయకత్వం అధికారిక ప్రకటన చేసింది. ఈ నియామకంపై శ్రీనివాసరావు స్పందిస్తూ... తనపై ప్రత్యేక నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ బాధ్యతను ఎంతో వినమ్రతతో, నిబద్ధతతో స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు, ప్రజా సమస్యలపై జనసేన వైఖరిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రజాసేవే తన ప్రథమ లక్ష్యమని ఆయన వ్యాఖ్యానించారు.తెలంగాణలో జనసేన పార్టీ విస్తరణకు, బలోపేతానికి నిరంతరం శ్రమిస్తూ, క్షేత్రస్థాయి ప్రజల సమస్యలను వెలుగులోకి తెచ్చి.. పార్టీకి-ప్రజలకు మధ్య బలమైన వారధిగా నిలుస్తానని చెప్పారు. ఈ నియామకానికి సహకరించిన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరికి, సీనియర్ నాయకత్వానికి, తనకు అండగా నిలుస్తున్న జనసైనికులు, వీర మహిళలు, పార్టీ శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

### సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు అందుకే

# అనుమతి ఇవ్వలేదు..

## - విదేశాంగ శాఖ క్లారిటీ



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదిత అమెరికా పర్యటనకు అనుమతి ఎందుకు ఇవ్వలేదో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) శుక్రవారం స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి హోదాకు, పర్యటన ఉద్దేశానికి అనుగుణంగా కార్యక్రమం లేదని భావించడంతో అమెరికా పర్యటనకు రాజకీయ అనుమతి నిరాకరించినట్లు ఎంఈఏ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖుల విదేశీ పర్యటనలకు రాజకీయ అనుమతి ఇచ్చే ముందు వారి కార్యక్రమాలను మంత్రిత్వ శాఖ పరిశీలిస్తుందని జైస్వాల్ చెప్పారు. సంబంధిత పదవికి, పర్యటన ఉద్దేశానికి తగినట్లుగా కార్యక్రమం ఉండాలని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన విషయంలో ఆ ప్రమాణానికి అనుగుణంగా కార్యక్రమం లేదని, అందుకే రాజకీయ అనుమతి ఇవ్వలేదని తెలిపారు. బ్రిటన్ పర్యటనకు మాత్రం అనుమతి ఇచ్చినట్లు గుర్తుచేశారు.రేవంత్ రెడ్డి ప్రస్తుతం లండన్‌లో ఉన్నారు. అక్కడి నుంచి అమెరికా వెళ్లి ఆగస్టు 30న హైదరాబాద్ చేరుకోవాల్సి ఉంది. అయితే అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంతో ఆయన ముందే హైదరాబాద్ చేరుకోనున్నారు. అమెరికా పర్యటనలో ఆయన 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందంతో కలిసి పెట్టుబడిదారులను కలవాల్సి ఉన్నట్లు తెలంగాణ సీఎంవో వెల్లడించింది. ఈ పర్యటనకు రాజకీయ కోణంలో అనుమతి నిరాకరించడంతో పర్యటనను రద్దు చేసుకోవాల్సి వచ్చిందని తెలిపింది.

## కాంగ్రెస్‌లో సవతుల పోరు..

### బీఆర్ఎస్ మళ్లీ పుంజుకుంటోంది: సీపీఐ నారాయణ



తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కలహాలు తీవ్రమవుతున్నాయని, నాయకుల మధ్య సవతుల పోరు నడుస్తోందని సీపీఐ సీనియర్ నేత నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ నేతల అంతర్గత విభేదాల కారణం వల్ల రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ పుంజుకుంటోందని ఆయన ఆరోపించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎక్కడా తప్పులు చేయకుండా నిక్కచ్చిగా వ్యవహరించినప్పుడే మంత్రులు, కిందిస్థాయి అధికారులలో భయం ఉంటుందని నారాయణ పేర్కొన్నారు. సీఎం ఇప్పటికైనా రాజకీయాలను పక్కనపెట్టి పూర్తిస్థాయిలో పాలనపైనే దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్రంలో నిషేధిత 22ఏ భూముల నిబంధనలను కొందరు అధికారులు, నాయకులు దారుణంగా దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. ఒకవైపు పాలిటెక్నిక్ విద్యార్థులు నిరసనలు, ఆందోళనలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేకపోవడం శోచనీయమన్నారు.ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వంలో తమ సీపీఐ పార్టీ భాగస్వామి కాదని, గడిచిన శాసనసభ ఎన్నికల్లో కేవలం సీట్ల సర్దుబాటు మాత్రమే చేసుకున్నామని గుర్తుచేశారు. ప్రజల ప్రయోజనాల దృష్ట్యా తాము ఇస్తున్న సూచనలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరుతో ప్రజల్లో కాంగ్రెస్ పాలన పట్ల అసంతృప్తి రోజురోజుకూ పెరుగుతోందని హెచ్చరించారు.

## ఆటో కార్మికుల రాష్ట్ర వ్యాప్త బంద్ ను విజయవంతం చేయండి: జగదీశ్ రెడ్డి



కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ నెల 24న చేపట్టబోయే ఆటో కార్మికుల రాష్ట్ర వ్యాప్త బంద్ పోస్టర్‌ను బీఆర్‌టీయూ నాయకులు, ఆటో డ్రైవర్లతో కలిసి సూర్యాపేటలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు.ఆర్టీసీ యాజమాన్యానికి ఈ-ఆటోలను కేటాయించే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని, ఆటో కార్మికుల రక్షణకు ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ఇంధన ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ ఛార్జీలను పెంచడంతో పాటు ఓలా, ఉబర్, రాపిడోలకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వమే సొంతంగా యాప్‌ను ప్రారంభించాలని సూచించారు. బైక్ టాక్సీల అక్రమ రవాణాను అరికట్టాలని, ఆటో కార్మికులకు ఏడాదికి రూ. 12 వేల ఆర్థిక సాయం అందించడంతో పాటు వారిని ఈ-చలాన్ల నుంచి మినహాయించాలని కోరారు.హైదరాబాద్‌లో ఇతర జిల్లాల ఆటోల అక్రమ రవాణాను అరికట్టాలని, వాహన సారథి లైసెన్స్ విధానాన్ని కొనసాగిస్తూ జీవో 60 ప్రకారం రేడియం స్టిక్కరింగ్ నుంచి ఆటోలకు మినహాయింపు ఇవ్వాలని పేర్కొన్నారు. ఆటో కార్మికులకు ప్రమాద బీమాతో పాటు సాధారణ మరణాలకు కూడా బీమా వర్తింపజేయాలని, 50 ఏళ్లు దాటిన వారికి పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న ఆటో కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ ఈ నెల 24న నిర్వహించే బంద్‌కు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

## తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన..

### తెలంగాణలో 28 వరకు వానలు!



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. దీని ప్రభావం కారణంగా తెలంగాణలో నేటి (ఆగస్టు 21) నుంచి ఈ నెల 28వ తేదీ వరకు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాలకు వాతావరణ కేంద్రం ఎల్లో అలర్ట్ జారీ చేసింది.ప్రధానంగా అదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ఈ ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మరోవైపు, ఆంధ్రప్రదేశ్‌లోనూ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఏలూరు, పోలవరం ప్రాంతాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. అలాగే కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, మిగిలిన కోస్తా జిల్లాల్లో చెదురుమదురు జల్లులు పడతాయని వివరించింది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

# పోలీస్ స్టేషన్ ముందు రాహుల్ గాంధీ ధర్నా..

## - పెల్లెట్ గన్ బాధితుడితో కలిసి ఎఫ్ఐఆర్ కోసం డిమాండ్

- పెల్లెట్ గన్ బాధితుడితో పోలీస్ స్టేషన్‌కు రాహుల్ గాంధీ - ఎఫ్ఐఆర్ కోసం సీనియర్ పోలీస్ అధికారి కార్యాలయం ముందు ధర్నా

- జులై 20 నిరసనల్లో పెల్లెట్లు తగిలాయని యువకుడి ఆరోపణ - పెల్లెట్ గన్స్ వాడలేదని ఢిల్లీ పోలీసుల వాదన



పెల్లెట్ గన్ గాయాల వ్యవహారంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం ఢిల్లీలో ఆందోళనకు దిగారు. జులై 20న జరిగిన జెన్-జీ విద్యార్థుల నిరసనల్లో పెల్లెట్ గన్ గాయాలయ్యాయని ఆరోపిస్తున్న సాహిల్ లోచాబ్‌ను వెంటబెట్టుకుని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అనంతరం సీనియర్ పోలీస్ అధికారి కార్యాలయం బయట బాధితుడితో కలిసి ధర్నాకు కూర్చున్నారు.జులై 20న పరీక్షల పేపర్ లీక్‌లకు నిరసనగా వందలాది మంది విద్యార్థులు పార్లమెంట్ వైపు మార్చ్ చేపట్టిన విషయం తెలిసిందే. ఆ సమయంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. 'ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్' (ఆర్ఏఎఫ్) సిబ్బంది పెల్లెట్ గన్స్ ఉపయోగించారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ ఘటనలో గాయపడినట్లు పలువురు నిరసనకారులు చెప్పడంతో పాటు వైద్య నివేదికలు కూడా ఉన్నాయని కాంగ్రెస్ పేర్కొంది.అయితే జులై 20న పెల్లెట్ గన్స్ ఉపయోగించలేదని ఢిల్లీ పోలీసులు పలుసార్లు తెలిపారు. ఈ అంశంపై సీఆర్‌పీఎఫ్ మాత్రం ఇప్పటివరకు స్పందించలేదు. మరోవైపు, గాయపడిన నిరసనకారుల వాంగ్మూలాలు, వైద్య నివేదికలు పెల్లెట్ గన్స్ వాడలేదన్న వాదనపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని కాంగ్రెస్ పేర్కొంది.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
22 శనివారం ఆగస్టు 2026

# మండల రెవెన్యూ కార్యాలయంలో టాయిలెట్ ను శుభ్రం చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు

### పెంట్లవెల్లి మండల రెవెన్యూకార్యాలయంలో మంత్రి ఆకస్మిక తనిఖీ

### రికార్డులను పరిశీలించిన మంత్రి

### అధికారుల పనితీరు, ఫైళ్ల క్లియరెన్స్ లో జాప్యంపై తీవ్ర ఆగ్రహం

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఇరిగి అశోక్
పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గారు అధికారుల నిర్లక్ష్యంపై వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండల కార్యాలయంలోని టాయిలెట్ అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన మంత్రి స్వయంగా తానే దానిని శుభ్రం చేసి అధికారులకు కనువిప్పు కలిగించారు.బి

పెంట్లవెల్లి రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అక్కడ దరఖాస్తులు, ఫైళ్ల పరిష్కారంలో జరుగుతున్న జాప్యంపై ఆయన ఆరా తీశారు. అధికారుల పనితీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన మంత్రి, ఆర్డీఓతో పాటు ఇతర సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పెండింగ్ ఉంచి, వారిని కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం సరికాదని మందలించారు. ఇకనైనా పనితీరును మార్చుకోవాలి హితవు పలికారు.బి

అదే సమయంలో కార్యాలయంలోని మరుగుదొడ్లు అత్యంత అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన మంత్రి.. సిబ్బంది నిర్లక్ష్యానికి నిరసనగా ఆయనే స్వయంగా నీళ్లు పోసి మరుగుదొడ్లను శుభ్రం చేశారు. ఉన్నత హోదాలో ఉన్న మంత్రి స్వయంగా ఈ పని చేయడంతో అక్కడి సిబ్బంది అవాక్కయారు.బి

అనంతరం పారిశుద్ధ్య సామగ్రి, టైల్స్ ఏర్పాటుకు తన వంతుగా తక్షణ ఆర్థిక సహాయం అందించారు. కార్యాలయ పరిసరాలతో పాటు టాయిలెట్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు.ప్రజలకు అందించే



సేవల్లో జాప్యం లేకుండా చూడటంతో పాటు కార్యాలయాల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం అధికారుల బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు.

# ఈ-ఆఫీస్‌తో వేగవంతమైన పోలీసు పరిపాలన

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 21:-
హైదరాబాద్, భవిష్యత్ సిటీ కమిషనరేట్ పరిధిలో డిజిటల్ పరిపాలనను మరింత బలోపేతం చేసే దిశగా పోలీసు అధికారులు, సిబ్బందికి ఈ-ఆఫీస్‌పై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. భవిష్యత్ సిటీ పోలీసు కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగింది. పోలీసు అధికారులు, కార్యాలయ సిబ్బంది, స్టేషన్ రైటర్లు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు తదితరులు శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల్లో కాగిత రహిత విధానాన్ని ప్రోత్సహిస్తూ ఈ-ఆఫీస్ వ్యవస్థ ద్వారా అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలు, దస్త్రాల నిర్వహణ, పరిపాలనా ప్రక్రియలను వేగంగా పూర్తి చేసే విధానాలను వివరించారు. దస్త్రాల సృష్టి, పరిశీలన, అధికారులకు పంపడం, డిజిటల్ నోటింగ్, ఉత్తరాల స్వీకరణ, పంపిణీ, దస్త్రాల స్థితిగతుల పరిశీలన, పెండింగ్ దస్త్రాల పరిష్కారం వంటి అంశాలపై సిబ్బందికి ప్రాయోగిక అవగాహన కల్పించారు. అధికారిక సమాచార గోప్యతను కాపాడుతూ నిర్దేశిత నిబంధనల ప్రకారం డిజిటల్ దస్త్రాలను నిర్వహించాలని



సూచించారు. ఈ-ఆఫీస్ వినియోగంతో కాగిత వినియోగం తగ్గడంతో పాటు జాప్యాలను నివారించడం, దస్త్రాల కదలికను సులభంగా గుర్తించడం, వివిధ విభాగాల మధ్య సమన్వయం పెంపొందించడం సాధ్యమవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు హుస్సేనీ నాయుడు, ఎ. చంద్రశేఖర్, బి. కిషన్, ఎస్. లక్ష్మీనారాయణ, ఎస్. జానకిరెడ్డి, అరుణ్‌కుమార్‌తో పాటు వివిధ విభాగాల సీఐలు, ఎస్‌హెచ్ఓలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, స్టేషన్ రైటర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. సిబ్బంది సందేహాలను నివృత్తి చేసుకున్నారు. సాంకేతికత ఆధారిత స్మార్ట్, సేఫ్, సెక్యూర్ పోలీసింగ్‌కు ఈ-ఆఫీస్ కీలకంగా నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు.

# బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ రాజీనామా చేయాలి

## వరంగల్ కోర్టు ముందు న్యాయవాదుల నిరసన

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి వరంగల్
బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ చేస్తున్న అనుచిత చర్యల వల్ల బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గౌరవాన్ని, విశ్వసనీయతను, సంస్థాగత వైభవాన్ని కోల్పోయిందని వాటన్నింటి పునరుద్ధరించడానికి అడ్వకేట్స్ యాక్ట్ ప్రకారం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను చట్టబద్ధంగా నడపటానికి బిసిఐ చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా రాజీనామాను డిమాండ్ చేస్తూ వరంగల్, హనుమకొండ జిల్లా న్యాయవాదులు కోర్టు ప్రధాన గేటు ముందు ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా జరుగుతున్న నిరసనలో బాగంగా శుక్రవారం హనుమకొండలో జరిగిన నిరసనలో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్, కాంగ్రెస్ లీగల్ సెల్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎ ఐ ఎల్ యు రాష్ట్ర కోశాధికారి ఎన్నంశెట్టి వేణుగోపాల్ రావు మాట్లాడుతూ న్యాయవాద వృత్తి నిలబెట్టాల్సిన రాజ్యాంగ విలువలకు కట్టుబడి పనిచేసే న్యాయవాదుల నిజమైన ప్రజాస్వామిక, స్వతంత్ర, ప్రాతినిధ్య సంస్థగా బిసిఐని చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా భ్రష్టు పట్టిస్తున్నాడని, ఏకపక్ష నిర్ణయాల వల్ల న్యాయవాదులకు రక్షణ కరువైందని అన్నారు. ఉన్నత విద్యా సంస్థ అయిన నల్సార్ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించి కాబోయే న్యాయవాదుల భవిషత్ ను నాశనం చేయాలని చూసిన మనన్ కుమార్ మిశ్రా భారత బార్ కౌన్సిల్ చైర్మన్ పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

అనుచిత చర్యలకు పాల్పడి విద్యార్థులకు క్షమాపణ చెప్పిన మనన్ కుమార్ చైర్మన్ పదవికి అనర్హుడని అన్నారు. తన ఆదిపత్య ధోరణితో, పలుకబడితో, బిజెపి అండతో గత 14 ఏండ్లుగా చైర్మన్ గా కొనసాగుతూ తన వ్యక్తిగత నిర్ణయాలతో ప్రజాస్వామ్య విలువలకు తూట్లు పొడిచి స్వీయ ప్రయోజనాలు పొందుతున్నారని విమర్శించారు. మనన్ కుమార్ బిజెపి పార్టీ తరుపున రాజ్యసభ




సభ్యుడిగా ఎన్నికైన కూడా బి సి ఐ చైర్మన్ పదవిని విడిచిపెట్టకుండా న్యాయవాద వ్యవస్థకే విలువ లేకుండా చేస్తున్నారని అన్నారు. ఆయన పరిధిలోకి రాని ముఖ్యమైన విషయాలైన పౌరసత్వ సవరణ చట్టం, ఆర్టికల్ 370 రద్దు, రైతు వ్యతిరేక చట్టాలపై ఆందోళన గూర్చి, వ్యవసాయ కార్మికుల ఆందోళన గూర్చి జారీ చేసిన ప్రకటనలు బిసిఐ విలువను దిగజారుస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐ ఎల్ పి ఎ రాష్ట్ర ఉపాధ్యక్షులు తీగల జీవన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్ మాట్లాడుతూ దేశాన్ని పాలిస్తున్న బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ బద్ధంగా నడవాల్సిన వ్యవస్థలపై అజమాయిషీ చేస్తుందని అలాంటి దుర్మార్గ పాలన కొనసాగిస్తున్న బిజెపి కి వంత పాడుతూ బిసిఐ ని భ్రష్టు పట్టిస్తున్న చైర్మన్ మనన్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని అన్నారు. మనన్ కుమార్ రాజీనామా చేసే వరకు దేశ వ్యాప్తంగా పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు.

1961 న్యాయవాదుల చట్టం కింద ఏర్పాటు చేసిన బి సి ఐ చట్టబద్ధమైన సంస్థ అని రాజ్యాంగ బద్ధంగా విధులను నిర్వహించి న్యాయవాదుల హక్కుల కోసం, రక్షణ కోసం పనిచేయాలని చైర్మన్ మనన్ కుమార్ అందుకు భిన్నంగా ప్రవర్తించడంతో దేశ వ్యాప్తంగా న్యాయవాదులు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. విభిన్న రాజకీయ భావాలున్న న్యాయవాదులకు నాయకత్వం వహించే బిసిఐ చైర్మన్ ఒక పార్టీకి, ఒక భావజాలానికి చెంది ఆ పదవిలో కొనసాగుతూ తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. జంతర్ మంతర్ దగ్గర నిరసన తెలిపిన విద్యార్థులను దేశ వ్యతిరేక శక్తులని, దేశ ద్రోహులని మాట్లాడడం హేయమైన చర్య అని, ఆయన వెంటనే రాజీనామా చేసి బిజెపి కి ఊడిగం చేసుకోవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎ ఐ ఎల్ యు రాష్ట్ర కమిటీ సభ్యులు సారంపల్లి మధుసూదన్ రెడ్డి, ఐ ఎల్ పి ఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు తీగల జీవన్ గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యులు జన్ను పద్మ, జిల్లా నాయకుడు పెండ్యాల అనిల్, జన్ను ప్రభాకర్, హనుమకొండ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రఘుపతి, ఐ ఎ ఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీమనాథం శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొత్తపల్లి చిరంజీవి, చంద్రమౌళి, మేడారపు రంజిత్, పాము రమేష్, న్యాయవాదులు అబ్దుల్ నబి, ఆనంద్, గంజి రమేష్, గంధం శివ, పూర్ణచందర్, భవాని ప్రసాద్, ప్రభంజన్, పూసపల్లి శ్రీనివాస్, యాకస్వామి, బండి మొగిలి, ఇజ్జగిరి సురేష్, మల్లేష్, విష్ణు వర్ధన్, వేముల రమేష్, బండి హరీష్, గురిమిల్ల రాజు, మర్రి రాజు, బానోత్ విజయ్, మేకల రంజిత్ తదితరులు పాల్గొన్నారు

# బీకొండ నారాయణ కుటుంబానికి పద్మశాలి సంఘం ఆర్థిక సహాయం



మెదక్,ఆగస్టు21(హైద్రాబాద్ ఎస్టేట్): మండల కేంద్రమైన పాపన్నపేటకు చెందిన ఏడుపాయల దేవస్థానం మాజీ డైరెక్టర్,పద్మశాలి సంఘం నాయకులు బీకొండ నారాయణ గురువారం రోజు అనారోగ్యంతో ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అకాల మరణం చెందాడు. ఈవిషయం తెలుసుకున్న పాపన్నపేట చేనేత పద్మశాలి సంఘం నాయకులు శుక్రవారం రోజు ఆయన అంత్యక్రియల నిమిత్తం రూ.5000/- ఆర్థిక సహాయం అందజేశారు. ఈకార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు కొడపాక విట్టల్, ఉపాధ్యక్షులు పల్లె సంగమేశ్వర్,పాపన్నపేట మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు వళ్ళందేశి శ్రీనివాస్, కొడపాక శివశంకర్, బద్దాపురం సంగమేశ్వర,చంద్రం,పల్లె లక్ష్మణ్,దాసరి యాదయ్య,తూర్పు రాము,అచుకట్ల గురునాధం,పద్మశాలి సంఘం నాయకులు మల్లేశం,తదితరులు పాల్గొన్నారు.అనంతరం పద్మశాలి సంఘం నాయకులు,బంధువులు ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

# రెండు చోట్ల అక్రమ మద్యం, నల్ల బెల్లం పట్టివేత



హైదరాబాద్ స్టేట్ ప్రతినిధి ఆగస్టు 21:-
ఇబ్రహీంపట్నం: విశ్వసనీయ సమాచారం మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు చేపట్టిన తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న మద్యం, నల్ల బెల్లం పట్టుబడ్డాయి. ఈ ఘటనలకు సంబంధించి ఇద్దరిని అరెస్టు చేసి కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. దాత్‌పల్లి క్రాస్‌రోడ్డు వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అక్రమంగా తయారు చేసిన మద్యం పట్టుబడింది. నిందితుడి నుంచి నాలుగు ప్లాస్టిక్ సీసాల్లో ఉన్న మొత్తం 10 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో సీసాలో 2.5 లీటర్ల చొప్పున మద్యం ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. అలాగే అక్రమ మద్యం తరలింపునకు ఉపయోగించిన మారుతి ఎర్టిగా వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో కోహెడ గ్రామానికి చెందిన గుండ్ల శ్రీనివాస్‌రెడ్డిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. మరో ఘటనలో ఆగాపల్లి క్రాస్‌రోడ్డు వద్ద పోలీసులు చేపట్టిన తనిఖీల్లో నల్ల బెల్లం పట్టుబడింది. పచ్చరంగు ఆటోలో తనిఖీలు నిర్వహించగా ఎనిమిది అట్టపెట్టెల్లో 160 కిలోల నల్ల బెల్లం లభించింది. దీంతో నల్ల బెల్లాన్ని, ఆటోను స్వాధీనం చేసుకుని వెంకేపల్లి తండాకు చెందిన ఉదావత్ నవీన్‌ను అరెస్టు చేశారు. రెండు ఘటనలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఎలుకుర్తి హవేలీలో వైభవంగా వరలక్ష్మీ వ్రతం

### భక్తిశ్రద్ధలతో సామూహిక పూజలు..

### పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్ష



గీసుగొండ, ఆగష్టు 21 హైదరాబాద్ ఎస్టేట్:
గీసుకొండ మండలం ఎలుకుర్తి హవేలీ గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు తిరుమల పురుషోత్తమాచారి, భాగవతుల ఉమామహేశ్వరశర్మ, భాస్కరాచారి ఆధ్వర్యంలో వేదోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వరలక్ష్మీదేవిని ఆరాధించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ పాడిపంటలు సమృద్ధిగా పండాలని, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని, అందరిపై శ్రీలక్ష్మీనరసింహస్వామి అనుగ్రహం ఉండాలని ఆకాంక్షించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. వ్రతం అనంతరం మహిళలు పరస్పరం వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జన్ను దివ్యభారతి, దేవాలయ కమిటీ నిర్వాహకులు, ఉపాధ్యాయులు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆదివాసీ సంస్కృతి పరిరక్షకుడు బుచ్చి రాములు

### మృతికి మడే పూర్ణిమ సంతాపం..

### అంతిమయాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకురాలు



మంగపేట, ఆగష్టు 21 హైదరాబాద్ ఎస్టేట్:
ములుగు జిల్లా మంగపేట మండలం నర్సాయిగూడెం గ్రామానికి చెందిన కల్తీ బుచ్చి రాములు మృతి పట్ల ములుగు జిల్లా కాంగ్రెస్ నాయకురాలు మడే పూర్ణిమ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం ఉదయం మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు. బుచ్చి రాములు భౌతికకాయాన్ని మడే పూర్ణిమ సందర్శించి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు బుచ్చి రాములు చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. తన జీవితకాలంలో ఆదివాసీ ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతిని భావితరాలకు చేరవేసేందుకు ఆయన నిరంతరం కృషి చేశారని గుర్తు చేశారు. నేటి తరం ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంచుకుని చైతన్యవంతంగా ముందుకు సాగేందుకు ఆయన చేసిన కృషి స్ఫూర్తిదాయకమన్నారు. బుచ్చి రాములు మృతి ఆదివాసీ సమాజానికి తీరని లోటని మడే పూర్ణిమ పేర్కొన్నారు.

ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం బుచ్చి రాములు అంతిమయాత్రలో పాల్గొని చివరి వరకు నడిచారు. అంతిమయాత్రలో ఆదివాసీ నాయకులు, యువకులు, మహిళలు, గ్రామస్థులు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని బుచ్చి రాములుకు ఘన నివాళులర్పించారు. ఉపాధ్యాయుడు సున్నం బుచ్చయ్యతో పాటు పలువురు ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241 ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER తెలుగు దిన పత్రిక hyderabadestate.co.in
22 శనివారం ఆగస్టు 2026

# 11వ తెలంగాణ మాస్టర్ స్విమ్మింగ్‌లో అంబర్‌పేట్ క్రీడాకారుల సత్తా

## ఇంద్రసేన యాదవ్‌కు 5 స్వర్ణాలు.. రాష్ట్ర స్థాయిలో తొలి ర్యాంక్



హైదరాబాద్, ఆగస్టు 21: జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో అంబర్‌పేట్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్విమ్మింగ్ పూల్‌లో ఆగస్టు 15న నిర్వహించిన 11వ తెలంగాణ మాస్టర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ 2026లో అంబర్‌పేట్ క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచారు.
ఇంద్రసేన యాదవ్ ఐదు స్వర్ణ పతకాలు సాధించి రాష్ట్ర స్థాయిలో తొలి ర్యాంక్‌ను కైవసం చేసుకున్నారు. వి. రమణ నాలుగు పతకాలు, రాజ్‌కుమార్ సురానా నాలుగు స్వర్ణాలు, ఒక రజత పతకం, మధు మూడు స్వర్ణాలు, రెండు రజత పతకాలు, మురళీధర్ రెడ్డి రెండు రజత పతకాలు సాధించి జట్టు విజయానికి తోడ్పడ్డారు.విజేతలను అంబర్‌పేట్ మాజీ కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జి. మల్లేష్ యాదవ్, రమేష్ గౌడ్, ఎం. శంకర్ ముదిరాజ్, అమృత్ రెడ్డి, శ్రీనివాస్ బాబా, రాజశేఖర్ రెడ్డి, శివ, ప్రభాకర్ యాదవ్, జగదీశ్వర్ రెడ్డి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.క్రీడాకారుల విజయానికి కోచ్‌లు కె. సురేష్, ప్రశాంత్, సుదీర్, కృష్ణ, గిరి కృషి చేసినందుకు నిర్వాహకులు అభినందనలు తెలిపారు.

# గంగారం గ్రామానికి 20 లక్షలు మంజూరు కేఎల్ఆర్ కి ధన్యవాదాలు తెలియజేసిన సర్పంచ్ దేవేందర్ నాయక్



( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి ఆగస్టు 21:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండలం గంగారం గ్రామానికి 20 లక్షలు మంజూరు చేసిన మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న... మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డికి గంగారం గ్రామపంచాయతీ లోని సమస్యల గురించి అభివృద్ధి మహేశ్వరం నుండి గంగారం విలేజ్ వరకు బి టీ .రోడ్డు మంజూరు చేయాలని అతి త్వరలో మంజూరు చేయిస్తానని తెలియజేశారు సిసి రోడ్డు అండర్ డేనేజ్ 20 లక్షలు మంజూరైనట్టు తెలియజేశారు అతి త్వరలో.గ్రామపంచాయతీలోని పనులు మొదలు పెడతామని నాలుగు లక్షల రూపాయలతోనే స్ట్రీట్ లైట్లు వచ్చినయని తెలియజేశారు గంగారం.గ్రామపంచాయతీకి ఏం పనులు కావానో నేను చూసుకుంటానని కేఎల్ఆర్ సార్ తెలియజేశారు ఈ కార్యక్రమంలో..పాల్గొన్నవారు గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్ వార్డ్ మెంబర్స్ ఏ రవి ఏం మోహన్ ఏం దేవా పి జయరాం సోమ్లా శ్రీనివాస్ తదితులు పాల్గొన్నారు

# అనాథ కుటుంబానికి 'అంజనిపుత్ర' అభయహస్తం

## రూ. 10 వేల ఆర్థిక సాయం అందించిన గుర్రాల శ్రీధర్



హైదరాబాద్ ఎస్టేట్ ఆగస్టు 21 తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మిగిలిన బాధితురాలికి దాతలు అండగా నిలిచారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు అమరావాది గ్రామానికి చెందిన జీలకర్ర బాణమ్మ ఇటీవల అనారోగ్య కారణంగా మృతిచెందడంతో ఆమె కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.ఇప్పటికే తండ్రి లేకపోవడం, ఇప్పుడు తల్లి కూడా మరణించడంతో ఆమె కుమార్తె ప్రియభారతి ఒంటరిదైంది. బాణమ్మకు నలుగురు సంతానం కాగా, ముగ్గురు కుమార్తెలకు ఇప్పటికే వివాహాలయ్యాయి. ఇంకా వివాహం కాని చిన్న కుమార్తె ప్రియభారతికి కుటుంబ బాధ్యతలు భారంగా మారాయి. తల్లి దశదిన కర్మ జరిపేందుకు కూడా దారి లేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం అమరావాది గ్రామస్తుడు జిలకర సురేష్ దృష్టికి వెళ్లింది.సురేష్ ద్వారా ఈ విషయాన్ని తెలుసుకున్న అంజనిపుత్ర ఎస్టేట్స్ చైర్మన్ గుర్రాల శ్రీధర్ వెంటనే స్పందించారు. బాధితురాలికి తల్లి దశదిన కర్మ ఖర్చుల నిమిత్తం రూ. 10,000 ఆర్థిక సహాయాన్ని గురువారం గ్రామస్తుల చేతుల మీదుగా అందజేశారు. ఆపద సమయంలో స్పందించి చేదోడుగా నిలిచిన గుర్రాల శ్రీధర్, సురేష్‌లకు బాధితురాలు, అమరావాది గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జిలకర మహేష్ ,మనోహర్, రాము,కిరణ్,ప్రవీణ్, రవి,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కుమ్మరి సంఘం మండల అధ్యక్షులుగా రామ్మూర్తి ఎన్నిక



హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిధి )
మండల కేంద్రంలో కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు చలిగంటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు మల్యాల రామ్మూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. అనంతరం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల బాధ్యతలు అప్పజెప్పడంతో ఎన్నిక కు సహకరించిన ప్రతి పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతూ కుమ్మరి సంఘానికి రావాల్సిన వాటాను మనమందరం ఐక్యతతో కలిసి సంఘాన్ని బలోపేతం చేసి రాష్ట్ర ప్రభుత్వంపై కొట్లాడటానికి సిద్ధంగా ఉండాలని వారన్నారు. అనంతరం నూతన అధ్యక్షులకు జిల్లా అధ్యక్షులతో సాలువాతో ఘన సన్మానం చేయడం జరిగినది. మండల అధ్యక్షునిగా రామ్మూర్తి, కార్యదర్శి నవీన్, ప్రచార కార్యదర్శి శివాజీ, ఎన్నుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల కులస్తులు పాల్గొన్నారు.

# ఎంఆర్‌పీఎస్ గ్రామ అధ్యక్షుడిగా కొంగర సంజయ్

## సంఘం బలోపేతం.. సామాజిక హక్కుల సాధనకు ప్రాధాన్యం





గీసుకొండ, ఆగస్టు 21 హైదరాబాద్ ఎస్టేట్: గీసుకొండ మండలం శాయంపేట (హ) గ్రామ ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడిగా కొంగర సంజయ్‌ను నియమించారు. ఈ మేరకు ఎంఆర్‌పీఎస్ గీసుకొండ మండల ఇన్‌చార్జి మాసాని గోపాల్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.
ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించి గ్రామస్థాయిలో ఎంఆర్‌పీఎస్‌ను మరింత బలోపేతం చేస్తానన్నారు. సంఘం ఆశయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు సామాజిక హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. సభ్యుల సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తూ, సంఘ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుని కార్యక్రమాలను విస్తృతం చేస్తానన్నారు. విద్యార్థులు, యువతను చైతన్య కార్యక్రమాల్లో భాగస్వాములను చేసి విద్య, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పిస్తానని పేర్కొన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అవగాహన కల్పిస్తూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. తనకు అప్పగించిన బాధ్యతను సంఘం ఆశయాలకు అనుగుణంగా సమర్థంగా నిర్వహించి శాయంపేట (హ)లో ఎంఆర్‌పీఎస్ కార్యకలాపాలను మరింత విస్తరిస్తానని కొంగర సంజయ్ స్పష్టం చేశారు.

# 1400 కోట్ల అభివృద్ధి పనులు ఎక్కడలిబిజెపి నేత పెరుమాండ్ల వెంకటేశ్వర్లు(వెంకన్న)గారు

హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్
స్టేషన్గన్పూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 1400 కోట్ల అభివృద్ధి పనులు ఎక్కడ చేసినారో ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు నియోజకవర్గ ప్రజలకు తెలిసే విధంగా బహిరంగంగా శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, బిజెపి ఎమ్మెల్యే కంటెస్టెడ్, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మరియు స్టేషన్ ఘన్పూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ పెరుమాండ్ల వెంకటేశ్వర్లు (వెంకన్న) గారు డిమాండ్ చేసినారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో చేరితేనే అభివృద్ధి జరుగుతుందనే ఆలోచనతో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నానని కడియం శ్రీహరి గారు అన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో కడియం శ్రీహరి గారు ఎమ్మెల్యేగా మరియు కడియం కావ్యగారు ఎంపీగా ఉన్నప్పటికీ నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని అన్నారు. ఒకనాటి టిఆర్ఎస్ పార్టీ మరియు ఈనాటి బిఆర్ఎస్ పార్టీలో తాటికొండ రాజయ్య గారు మరియు కడియం శ్రీహరి గారు మంత్రి పదవులతో పాటు ఉప ముఖ్య మంత్రి పదవి కూడా చేసినారు కానీ నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదని అన్నారు.దానికి నిలువెత్తు సాక్ష్యం స్టేషన్ ఘన్పూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన బహిరంగ సభలో స్వయంగా కడియం శ్రీహరి గారే ఒప్పుకున్నారని,అది వాస్తవమేనని స్టేషన్ ఘన్పూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోనిగ్రామాలు తిరిగినప్పుడు గ్రామాల్లోని ప్రజలు అనేకమైన సమస్యలు ఉన్నాయని, ఎవరు పట్టించుకోవడం లేదని ఈ సమస్యల పరిష్కారశీ జరిగేంతవరకు ప్రయత్నం కొనసాగాలని ప్రజలు చెప్పడం జరిగిందని బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు,బిజెపి కంటెస్టెంట్ ఎమ్మెల్యే, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మరియు స్టేషన్గన్పూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ పెరుమాండ్ల వెంకటేశ్వర్లు (వెంకన్న) గారు అన్నారు.



# అమెరికా గడ్డపై మార్మోగిన వేములవాడ ఒగ్గుకథ.. మిద్దె కుటుంబానికి ఘన సన్మానం



హైదరాబాద్ ఎస్టేట్ రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్ ఛార్జ్ వెల్దండి సదానందం
తెలంగాణ జానపద కళకు అంతర్జాతీయ వేదికపై మరోసారి అరుదైన గౌరవం దక్కింది. వేములవాడకు చెందిన ప్రముఖ ఒగ్గుకథ కళాకారుడు స్వర్గీయ మిద్దె రాములు అందించిన కళా వారసత్వాన్ని కొనసాగిస్తూ ఆయన మనుమడు మిద్దె వినీత్, కుమారుడు మిద్దె పర్శ రాములు అమెరికాలోని ఓక్లాండ్ వేదికపై ఒగ్గుకథ ప్రదర్శించి ప్రవాస భారతీయులను ఆకట్టుకున్నారు.సిలికాన్ ఆంధ్ర ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జానపద కళా వైభవాన్ని ఒగ్గుకథ రూపంలో చాటిచెప్పారు. అమెరికా వేదికపై ఒగ్గుకథకు లభించిన ఆదరణ తెలంగాణ జానపద కళకు దక్కిన అంతర్జాతీయ గుర్తింపుగా పలువురు అభివర్ణించారు.ఈ సందర్భంగా మిద్దె వినీత్, మిద్దె పర్శ రాములను భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రేగుల సంతోష్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వేములవాడ కళాకారులు వేలాది కిలోమీటర్ల దూరంలోని అమెరికా వేదికపై ఒగ్గుకథను ప్రదర్శించడం వేములవాడతో పాటు యావత్ తెలంగాణకు గర్వకారణమని సంతోష్ బాబు అన్నారు.స్వర్గీయ మిద్దె రాములు అందించిన కళా వారసత్వాన్ని కుటుంబ సభ్యులు సమర్థవంతంగా కొనసాగిస్తూ తెలంగాణ జానపద కళకు ప్రపంచస్థాయిలో గుర్తింపు తీసుకురావడం అభినందనీయమన్నారు. ఒగ్గుకథ వంటి ప్రాచీన జానపద కళారూపాలను కాపాడి భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేస్తున్న కళాకారులను ప్రభుత్వం, ప్రజలు ప్రోత్సహించాలని కోరారు. మిద్దె రాములు కుటుంబ వారసులు అమెరికా వేదికపై ప్రదర్శించిన ఒగ్గుకథ ప్రతి తెలంగాణ బిడ్డకు గర్వకారణమని పేర్కొన్నారు.
కార్యక్రమంలో పార్టీ నాయకులు మైలారం శ్రీనివాస్, జక్కుల తిరుపతి, బుర్ర శేఖర్ గౌడ్, వివేక్ రెడ్డి, రేగుల రాజ్ కుమార్, నేరెళ్ల సాయి, మల్లారం తిరుపతి, నామాల శేఖర్, నందరగిరి రాహుల్, నేరెళ్ల కిరణ్, ఖమ్మం పృథ్వీరాజ్, అన్నారం శివ, కార్తీక్, హరీష్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



# తిరంగా ర్యాలీపై కేసు నమోదు అక్రమం: లడ్డు యాదవ్

అఫ్జల్‌గంజ్, ఆగస్టు 21: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన తిరంగా ర్యాలీపై అఫ్జల్‌గంజ్ పోలీసులు తనపై కేసు నమోదు చేయడం అన్యాయమని భగత్‌సింగ్ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు లడ్డు యాదవ్ ఆరోపించారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.బేగంబజార్ ఛత్రి నుంచి భగత్‌సింగ్ యువసేన ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించామని, దేశభక్తి కార్యక్రమాన్ని నేరంగా పరిగణిస్తూ కేసులు నమోదు చేయడం సమంజసం కాదని అన్నారు. గత ఏడాది కూడా ఇదే తరహాలో శాయినాథ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తనపై నమోదు చేసిన కేసును నాంపల్లి 16వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు కొట్టివేసిందని గుర్తు చేశారు. దేశం కోసం నిర్వహించిన ర్యాలీపై కేసు నమోదు చేయడాన్ని కోర్టు తప్పుబట్టిందని చెప్పారు. ప్రస్తుత కేసు కూడా న్యాయస్థానంలో నిలవదని, ఇదే విధంగా కొట్టివేయబడుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. యువతను భయభ్రాంతులకు గురిచేయడం, కక్షసాధింపు చర్యల్లో భాగంగానే పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.తనపై కేసు నమోదు వెనుక ఎవరి ఒత్తిడి ఉందో ప్రభుత్వం, పోలీసు అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అఫ్జల్‌గంజ్ పోలీసులు నమోదు చేసిన కేసును సవాలు చేస్తూ హైకోర్టును ఆశ్రయిస్తానని లడ్డు యాదవ్ వెల్లడించారు.



RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# 300 మందికి ఉచిత ఆర్థోపెడిక్ వైద్య పరీక్షలు

## ఆర్యవైశ్య సత్రంలో వైద్య శిబిరం.. శ్రీకర హాస్పిటల్ వైద్యుల సేవలు







వరంగల్, ఆగస్టు 21 హైదరాబాద్ ఎస్టేట్:
వరంగల్ రామన్నపేటలోని ఆర్యవైశ్య సత్రంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సమస్యలపై వైద్య సలహాలు అందించడంతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సత్రం, వాసవి హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో హైదరాబాద్‌కు చెందిన శ్రీకర హాస్పిటల్ వైద్యులు డాక్టర్ అఖిల్ దాడి, డాక్టర్ శివకుమార్ కోటా, డాక్టర్ అన్వేష్ గౌడ్ పాల్గొని రోగులకు వైద్య సేవలు అందించారు. ఆర్థోపెడిక్ సమస్యలతో శిబిరానికి వచ్చిన వారికి పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య పరిస్థితిని బట్టి తగిన వైద్య సూచనలు చేశారు. ఉచిత వైద్య పరీక్షలతోపాటు మందులు కూడా అందించడంతో రోగులు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా వైద్య శిబిరాన్ని నిర్వహించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. తమ విలువైన సమయాన్ని కేటాయించి వరంగల్ ప్రజలకు వైద్య సేవలందించిన శ్రీకర హాస్పిటల్ వైద్య బృందాన్ని నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించారు. శిబిరం నిర్వహణలో ఆర్యవైశ్య సత్రం అధ్యక్షుడు గట్టు మహేష్‌బాబు, గంపా అమర్‌నాథ్, పడిశాల నాగరాజ్, వాసవి హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు మాదారపు రాజేశ్వర్‌రావు, గందె గోవిందరాజులు, తౌనుపునూరి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.




హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ
స్టైపెండ్ పెంపు, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆయుష్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్యులు వరంగల్ కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గత కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రంజిత్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రంజిత్ రెడ్డి మాట్లాడుతూ....గత 19 రోజులుగా ఆయుర్వేదిక్ వైద్యశాల వైద్యులు తమ స్టైఫండ్ పెంచాలని కోరుతూ నిరసన చేపడుతున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు స్పందించకపోవడం తీవ్ర సిగ్గుచేటని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు రంజిత్ రెడ్డి మండిపడ్డారు.... డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గతంలో ఆయుర్వేదిక్ వైద్యులకు ఇచ్చిన మాట ప్రకారం స్టైఫండ్ పెంచడంలో పూర్తిగా విఫలమయ్యారని, ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. వైద్యులు ఇన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.

బైట్స్....

బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రంజిత్ రెడ్డి..

ఆయుర్వేదిక్ వైద్యాలు రమ్య

# గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ తల్లి శంకుస్థాపన భూమి పూజ సర్పంచ్ పూజా హరిబాబు





హైదరాబాద్ స్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి ఆగస్టు 21
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం బేగంపేట్ గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ తల్లి శంకుస్థాపన భూమి పూజ కార్యక్రమం గ్రామ సర్పంచ్ పూజా హరిబాబు, మాజీ ఎంపీటీసీ బాలరాజ్ తో కలిసి పాల్గొని, అమ్మవారి ఆశీస్సులు పొందడం జరిగింది. పోచమ్మ తల్లి కృపాకటాక్షాలతో బేగంపేట్ గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో బేగంపేట్ సర్పంచ్ పూజా హరిబాబు ఉపసర్పంచ్ నిర్మలమాజీ సర్పంచ్ బల్గూరి జంగయ్య, మాజీ ఎజ్౫ె వారికిపాల బాల్‌రాజ్, మాజీ ఉప సర్పంచ్ బాలం, తిరుపతయ్య గ్రామ పెదళ్లు యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# కల్వకోలు గ్రామంలో అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంపీడీవో శారద



( హైదరాబాద్ స్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి ఆగస్టు21:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కల్వకోలు గ్రామపంచాయతీని మండల ఎంపీడీవో శారద సందర్శించారు.గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మతో కలిసి గ్రామపంచాయతీలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా జలసిరి పనుల పురోగతి,ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతి,నర్సరీని పరిశీలించారు.గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో,నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి ఎంపీడీవో సూచించారు.ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఈసీ ఆదిత్య,విలేజ్ సెక్రటరీ వేణు,అనిల్,కొండని లావణ్య,గ్రామ పెద్ద బక్కని రవి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# మిలాద్ ఉన్ నబీ మహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి పుట్టినరోజు వేడుకలు ఆహ్వానం

( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి ఆగస్టు 21:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో తేదీ 26 ఆగస్టు 2026 బుధవారం రోజున జరుగు మిలాద్ ఉన్ నబీ మహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పుట్టినరోజు సందర్భంగా ఘనంగా నిర్వహించే ఉత్సవాలకు మహేశ్వరం పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గారిని మరియు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ మహేశ్వరం జోన్ గారిని ముస్లిం కమిటీ తరపున ఆహ్వానించడం జరిగింది ఈ కార్యక్రమంలో మహేశ్వరం ముస్లిం కమిటీ అధ్యక్షులు మహమ్మద్ అబ్దుల్ ఫరీద్, ఉపాధ్యక్షులు మహేశ్వరం 5 వ వార్డ్ నెంబర్ షేక్ ఆజం, ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ మోసిన్ ఖాన్, కోశాధికారి సయ్యద్ షకీల్ అలీ, మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షుడు షేక్ హాజీ బాబా, మైనార్టీ డిపార్ట్మెంట్ చైర్మన్ మహమ్మద్ ఇర్షాద్, గ్రామ ముస్లిం పెద్దలు మొహమ్మద్ షానవాజ్, మహమ్మద్ హనీఫ్, చోటి మజీద్ మౌజాన్ సాహెబ్ సయ్యద్ షబాజ్ అలీ, గ్రామ ముస్లిం యువకులు మొహమ్మద్ హైదర్ ఖురేషి, మహమ్మద్ ఇంతియాజ్, మహమ్మద్ అబ్బాస్ ఖురేషి, మొహమ్మద్ ఫహద్,



మహమ్మద్ షాహిద్, తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీకి పట్టుబడ్డ పంచాయతీ కార్యదర్శి



మంచిర్యాల జిల్లాలో శు క్రవారం నాడు పంచాయతీ కార్యదర్శి ఏసీబీకి పట్టుబడ్డారు. జిల్లాలోని జన్నారం మండలంలో శుక్రవారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు.లింగయ్యపల్లె గ్రామపంచాయితీ కార్యదర్శి వరలక్ష్మి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఓ వ్యక్తి ఇంటి నిర్మాణానికి అనుమతి కోసం రూ.11 వేలు లంచం డిమాండ్ చేసినట్లు ఫిర్యాదు రావడంతో ఏసీబీ అధికారులు మాటువేసి రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు. తీసుకున్న లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు ఆమెపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

# APPSCDSC పై జగన్ వ్యాఖ్యలు గందరగోళం సృష్టిస్తున్నాయి

## - మాజీ ముఖ్యమంత్రి బాధ్యతాయుతంగా వ్యవహరించాలి: డా. పిట్టా వరప్రసాద్

విజయవాడ, ఆగస్టు 21, 2026:
ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఞ్రాూాజ, ఞూజ నియామకాలపై చేస్తున్న వ్యాఖ్యలు నిరుద్యోగ యువత, విద్యార్థులు, ఉద్యోగుల్లో గందరగోళం సృష్టించే విధంగా ఉన్నాయని డా. పిట్టా వరప్రసాద్ తీవ్రంగా ఖండించారు.
మాజీ ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి ఒక అంశంపై విమర్శలు చేసే ముందు వాస్తవాలను పూర్తిగా తెలుసుకోవాలని ఆయన సూచించారు. ఞ్రాూాజ, ఞూజ రెండూ వేర్వేరు నియామక వ్యవస్థలు కాగా, వాటిని ఒకే విధంగా చిత్రీకరించడం ద్వారా ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న లక్షలాది మంది అభ్యర్థులను అయోమయానికి గురిచేయడం సరికాదన్నారు.జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే ఞ్రాూాజకి సంబంధించిన కొన్ని పరీక్షలు, నియామక ప్రక్రియలపై వివాదాలు తలెత్తాయని, వాటిలో మూల్యాంకనం (జుఝశ్రీఋఖఅశీఅ) వంటి అంశాలపై న్యాయస్థానాల్లో కూడా అభ్యంతరాలు వ్యక్తమైన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో జరిగిన పరిణామాలను విస్మరించి, ఇప్పుడు మొత్తం వ్యవస్థను తప్పుబట్టడం రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు.అదేవిధంగా ఞూజ విషయంలో పేపర్ లీకేజీ జరిగిందని, ఉద్యోగాలు అమ్ముకున్నారని, అవకతవకలు జరిగాయని ఆధారాలు లేకుండా రకరకాల ఆరోపణలు చేయడం ద్వారా అభ్యర్థుల్లో భయాందోళనలు కలిగించడం బాధ్యతారాహిత్యమని డా. పిట్టా వరప్రసాద్ అన్నారు. ఏదైనా అక్రమం జరిగిందని ఆధారాలు ఉంటే వాటిని బయటపెట్టి, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి, న్యాయపరమైన మార్గాన్ని ఆశ్రయించాలి కానీ రాజకీయ వేదికలపై నిరాధార ఆరోపణలు చేయకూడదని ఆయన అన్నారు. నిరుద్యోగ యువత ఎన్నో సంవత్సరాలుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, వారి భవిష్యత్తుతో రాజకీయాలు ఆడుకోవడం సరికాదన్నారు. ఉద్యోగ నియామకాలపై అనుమానాలు కలిగించే వ్యాఖ్యలు చేయడం వల్ల పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల మానసిక స్థైర్యం దెబ్బతింటుందని పేర్కొన్నారు."మాజీ ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ప్రజలకు దిశానిర్దేశం చేయాలి. కానీ ప్రతి నియామకాన్ని వివాదాస్పదం చేస్తూ, నిరుద్యోగ యువతను ఆందోళనలకు ప్రేరేపించడం ద్వారా వారికి నష్టం చేయకూడదు" అని డా. పిట్టా వరప్రసాద్ అన్నారు.అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలపై చర్చ జరగాల్సిన సమయంలో ప్రతిపక్షం ప్రతి అంశాన్ని అడ్డుకోవడం, సభా కార్యక్రమాలను సజావుగా సాగనివ్వకపోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయాన్ని వ్యతిరేకించడం కంటే, లోపాలు ఉంటే వాటిని నిర్మాణాత్మకంగా ఎత్తిచూపి ప్రత్యామ్నాయ పరిష్కారాలు సూచించాలని కోరారు.
ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానికి ప్రశ్నించే హక్కు ఉన్నప్పటికీ, సభలో చర్చను అడ్డుకోవడం, బయట నిరసనలు నిర్వహించడం, ఉద్యోగ నియామకాలపై ఆధారాలు లేని ఆరోపణలు చేయడం ద్వారా ప్రజల్లో గందరగోళం సృష్టించడం ప్రతిపక్ష బాధ్యత కాదని ఆయన అన్నారు. యువతకు స్పష్టత ఇవ్వాలి రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలపై ప్రభుత్వం సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని, నియామక ప్రక్రియలకు స్పష్టమైన వార్షిక ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించాలని డా. పిట్టా వరప్రసాద్ డిమాండ్ చేశారు.
ఞ్రాూాజ, ఞూజ సహా అన్ని నియామక సంస్థల వ్యవహారాల్లో పారదర్శకత, మెరిట్, న్యాయబద్ధత ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏ పరీక్షలోనైనా పేపర్ లీక్ లేదా అక్రమాలు జరిగాయని నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.
"నిరుద్యోగ యువతకు కావాల్సింది రాజకీయ గందరగోళం కాదుఉద్యోగం. వారికి కావాల్సింది ఆరోపణలు కాదుపారదర్శక నియామకాలు. గత ప్రభుత్వ తప్పిదాలను కప్పిపుచ్చుకోవడం, ప్రస్తుత ప్రభుత్వ నియామకాలను అనవసరంగా వివాదాస్పదం చేయడం రెండూ సరికాదు. యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మాజీ ముఖ్యమంత్రి బాధ్యతాయుతమైన భాషలో మాట్లాడాలి" అని డా. పిట్టా వరప్రసాద్ స్పష్టం చేశారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# బాల్యం నుంచి పోరాటం సామాజిక సేవలో ముందంజలో బొర్ర అరుణ్ అంబేద్కర్

## కార్మిక వర్గాల నుంచి విద్యార్థి ఉద్యమాల వరకు దళిత బహుజన చైతన్యానికి చిరునామాగా ఎదిగిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు

సూర్యాపేట జిల్లా, ఎల్కారం గ్రామానికి చెందిన బొర్ర అరుణ్ అంబేద్కర్ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడిగా సామాజిక, రాజకీయ రంగాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. చిన్నతనం నుంచే కష్టాన్ని నమ్ముకున్న ఆయన జీవన ప్రయాణం, దళిత బహుజన సమాజానికి ఆదర్శంగా నిలుస్తోంది.

బాల్యం నుంచే శ్రమ జీవితం

బొర్ర అరుణ్ అంబేద్కర్ కేవలం 14 సంవత్సరాల వయసు నుంచే కార్మిక వర్గాలతో కలిసి పనిచేస్తూ శ్రమ విలువను తెలుసుకున్నారు. కూలీలు, కార్మికులు ఎదుర్కొనే సమస్యలను దగ్గరగా చూసిన ఆయన, వారి హక్కుల కోసం చిన్న వయసులోనే చైతన్యవంతమైన ఆలోచనలను పెంపొందించుకున్నారు.

ఉస్మానియా విద్యార్థి ఉద్యమాలతో అనుబంధం

హైదరాబాద్‌లో విద్యార్థి దశలో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘాలతో కలిసి అంబేద్కర్–పూలే భావజాలాన్ని వ్యాప్తి చేయడంలో కీలక పాత్ర పోషించారు. తన ఆధ్వర్యంలో ఏర్పడిన అంబేద్కర్ పూలే సంఘం ద్వారా విద్యార్థులతో కలిసి అనేక సామాజిక, విద్యా సమస్యలపై చర్చలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

దళిత విద్యార్థులు ఎదుర్కొనే వివక్ష, విద్యా అవకాశాలు, రాజ్యాంగ హక్కులపై యువతలో చైతన్యం తీసుకురావడానికి ఆయన నిరంతరం కృషి చేశారు.

సాధారణ కార్మికుడి నుంచి వ్యాపారవేత్తగా

హైదరాబాద్ మహానగరంలోని మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) లో ఒక సాధారణ వ్యక్తిగా పనిచేస్తూ జీవితం ప్రారంభించిన అరుణ్ అంబేద్కర్, తన కష్టాన్ని నమ్ముకుని నేడు ఎంజీబీఎస్ బస్టాండ్ పరిసరాల్లో ఐదు నుంచి పది షాపులకు యజమానిగా ఎదిగారు.
కార్మికుడి స్థాయి నుంచి స్వయం శక్తితో పైకి వచ్చిన ఆయన ప్రయాణం, యువతకు ప్రేరణగా నిలుస్తోంది.

15 ఏళ్ల రాజకీయ అనుభవం

సూర్యాపేట జిల్లాలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులతో కలిసి సుమారు 15 సంవత్సరాల రాజకీయ అనుభవం సంపాదించిన అరుణ్ అంబేద్కర్, ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేస్తున్నారు.

హైదరాబాద్ చైతన్యపురి డివిజన్‌లో ప్రజల మధ్య పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న ఆయన, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి మరియు తెలంగాణ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి లతో కలిసి తెలంగాణ రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు.

విద్యార్థుల కోసం ఆర్థిక సహాయం

అరుణ్ అంబేద్కర్ సేవల్లో ముఖ్యమైన అంశం షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు విద్యా సహాయం అందించడం. పేద విద్యార్థుల ఫీజులు, పుస్తకాలు, హాస్టల్ అవసరాల కోసం తన వంతు ఆర్థిక సహకారం అందిస్తూ అనేక మంది విద్యార్థుల చదువులకు తోడ్పడుతున్నారు.

అంబేద్కర్–పూలే యువజన సంఘ నిర్మాణం

తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ పూలే యువజన సంఘాన్ని స్థాపించి, సామాజిక న్యాయం, విద్యార్థుల హక్కులు, దళిత బహుజన సంక్షేమం కోసం పలు ఉద్యమాలు చేపట్టారు.

ఆయన భావజాలం డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, ఛత్రపతి సాహు మహారాజ్, పెరియార్, రమాబాయి అంబేద్కర్, సావిత్రిబాయి పూలే వంటి మహనీయుల ఆలోచనల ప్రభావంతో రూపుదిద్దుకుంది.
యువతకు రాజ్యాంగ సందేశం
“దేశ యువత విద్యావంతులు కావాలిడ భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి ఇచ్చిన విద్యా హక్కును అందిపుచ్చుకుని, తాము నేర్చుకున్న విద్యను మరో పదిమందికి పంచాలి” అనే సందేశాన్ని అరుణ్ అంబేద్కర్ తరచూ యువతకు అందిస్తున్నారు.

దళిత, బహుజన, వెనుకబడిన వర్గాలను అంబేద్కర్–పూలే భావజాలంతో ఏకం చేయడంలో ఆయన పాత్ర విశేషంగా నిలుస్తోంది.

దళిత రత్న అవార్డు

సామాజిక సేవలు, విద్యార్థి చైతన్యం, దళిత బహుజన హక్కుల కోసం చేసిన కృషికి గుర్తింపుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2026 ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా “దళిత రత్న” అవార్డును ప్రదానం చేసింది.

ఈ అవార్డు తెలంగాణ రాష్ట్ర ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో అందించడం ఆయన సేవలకు ప్రభుత్వ స్థాయి గుర్తింపుగా భావిస్తున్నారు.

115 మందితో రక్తదాన శిబిరం

గత ఏడాది తెలంగాణ రాష్ట్ర పూలే అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సంఘ సభ్యులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా 115 మంది రక్తదాతలను సమీకరించి ప్రభుత్వ ఆసుపత్రులకు రక్తాన్ని అందించారు.

ఈ కార్యక్రమం ద్వారా అనేక మంది రోగులకు ప్రాణాధారంగా నిలిచిన సంఘ సభ్యులను అరుణ్ అంబేద్కర్ “ప్రాణదాతలు”గా అభివర్ణించారు.

సమాజ సేవే లక్ష్యం



కార్మిక జీవితపు కష్టాలను అనుభవించిన వ్యక్తిగా, విద్యార్థి ఉద్యమాల నుంచి సామాజిక సేవ వరకు నిరంతరం ప్రజల మధ్య పనిచేస్తున్న బొర్ర అరుణ్ అంబేద్కర్, సూర్యాపేట జిల్లా నుంచి తెలంగాణ రాష్ట్ర స్థాయి వరకు దళిత బహుజన చైతన్యానికి ప్రతినిధిగా నిలుస్తున్నారు.

బాల్యం నుంచి శ్రమడ విద్యార్థి ఉద్యమాల్లో చైతన్యం
డవ్యాపారంలో స్వయం సాధనడ సమాజ సేవలో అంకితభావం
ఈ నాలుగు లక్షణాల సమ్మేళనంగా బొర్ర అరుణ్ అంబేద్కర్ జీవన ప్రయాణం ప్రత్యేక గుర్తింపును పొందుతోంది.......

రమేష్ దారమళ్ళ 9133458387 .

# అభ్యర్థులు విజయం సాధించాలంటే ప్రణాళికాబద్ధంగా చదువుతూ, నిర్దిష్ట లక్ష్యంతో ముందుకు సాగాలి

### - జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ,



పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న అభ్యర్థులు విజయం సాధించాలంటే ప్రణాళికాబద్ధంగా చదువుతూ, నిర్దిష్ట లక్ష్యంతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు, పాఠకులకు కల్పిస్తున్న సౌకర్యాలు, డిజిటల్ లైబ్రరీ ఏర్పాట్లు, మౌలిక వసతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో కలెక్టర్ ముఖాముఖిగా మాట్లాడారు. మీరు ఏయే ఉద్యోగాల సాధనకు పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు, సన్నద్ధతకు అవసరమైన పుస్తకాలు, ఇతర సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థులకు అవసరమైన కాంపిటీటివ్ పుస్తకాలు అందుబాటులో ఉంచడంతో పాటు కంప్యూటర్స్ సదుపాయం, ఆర్ఓ వాటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రంథాలయాలను మరింత బలోపేతం చేసేందుకు, అవసరమైన నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు క్రమశిక్షణతో చదువుతూ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నిరంతర సాధనతో పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. అనంతరం గ్రంథాలయ ప్రాంగణంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మొక్క నాటారు. పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అభ్యర్థులు సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, తహసీల్దార్ లక్ష్మీ రాజయ్య, గ్రంథాలయ కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన



వర్ధన్నపేట కేంద్రంలోని కోనారెడ్డి చెరువు అభివృద్ధి పనులకు గురువారం వర్ధన్నపేట నియోజకవర్గం ఎమ్మెల్యే, కేఆర్ నాగరాజు 3.14కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. నిర్మాణం పనులలో వేగం పెంచాలని, పనులు నాణ్యత ప్రమాణాలతో ఎక్కడా రాజీపడకుండా చేయాలన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లడానికి నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే అనేక అభివృద్ధి పనులు జరిగాయన్నారు. పనులు త్వరగా పూర్తి చేసి వచ్చే ఏడాది కల్లా కాలువల ద్వారా రైతులకు నీరు అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేందర్ ,పట్టణ అధ్యక్షులు ఈగ దామోదర్, వర్ధన్నపేట మండల అధ్యక్షులు గోశాల వెంకన్న,ఇల్లంద మార్కెట్ చైర్మెన్ నరకుడు వెంకటయ్య, ఐనవోలు దేవస్థాన చైర్మన్ ప్రభాకర్ గౌడ్, కౌన్సిలర్లు పాపారావు, వాణి కుమారస్వామి, కిమా నాయక్, సర్పంచ్లు, మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు అవసరమైన భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి

### - జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ,



చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు అవసరమైన భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు.
గురువారం ఐడీఓసీ కార్యాలయపు కాన్ఫరెన్స్ హాలులో రెవెన్యూ, ఇరిగేషన్, మెగా కంపెనీ అధికారులతో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు భూ సేకరణ, కాలువల నిర్మాణ పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాజెక్టు పనుల్లో జాప్యం లేకుండా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో వేగవంతం చేయాలని సూచించారు. భూ సేకరణకు సంబంధించిన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, ప్రాజెక్టు నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూ సేకరణకు అవసరమైన భూముల సర్వే ప్రక్రియను వేగంగా పూర్తి చేసి, సర్వేకు సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు అందచేయాలని ఆదేశించారు. కాలువల నిర్మాణ పనులతో పాటు ప్రాజెక్టుకు సంబంధించిన ఇతర పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, పనుల అమలులో ఎదురవుతున్న సమస్యలను శాఖల మధ్య సమన్వయంతో పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ప్రాజెక్టు పనులు పూర్తయ్యేలా రెవెన్యూ, ఇరిగేషన్, సంబంధిత సంస్థల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టం చేశారు. పనుల పురోగతిపై నిరంతరం సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం ఆర్డీఓ రవీందర్, తహసీల్దార్లు, ఇరిగేషన్ ఇంజినీర్లు, మెగా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ పతాక గౌరవాన్ని కాపాడాలి

### - పరకాల బీజేపీ నేతలు,
### - ఆగస్టు 15న అమరధామంలో జాతీయ పతాక ఆవిష్కరణలో గౌరవ వందనం చేయని కమిషనర్,
### - తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆర్డీవోకు వినతిపత్రం, అందజేత,




పరకాల అమరధామంలో ఆగస్టు 15న నిర్వహించిన జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గౌరవ వందనం చేయకపోవడాన్ని బీజేపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. జాతీయ పతాకాన్ని అవమానించేలా వ్యవహరించిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ పరకాల పట్టణ బీజేపీ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. జాతీయ పతాక గౌరవం విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జయంతీలాల్, మేఘనాథ్, గురుప్రసాద్, నరేష్, సురేష్ పాల్గొన్నారు.

RNI No Tel /2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
22 శనివారం ఆగస్టు 2026

# సూర్య మానసిక పోరాటాలు చూశాను

## : సక్సెస్ మీట్‌లో నటి రాధికా శరత్‌కుమార్ భావోద్వేగ వ్యాఖ్యలు




తాజాగా విడుదలైన 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంతో కోలీవుడ్ స్టార్ హీరో సూర్య భారీ విజయాన్ని అందుకున్నారు. ఈ సినిమా విజయవంతమైన సందర్భంగా నిర్వహించిన సక్సెస్ మీట్‌లో సూర్యకు తల్లిగా నటించిన సీనియర్ నటి రాధికా శరత్‌కుమార్ పాల్గొని, ఆయన గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

ఈ కథను సూర్య అంగీకరించారని తెలిసి తాను ఆశ్చర్యపోయానని రాధిక అన్నారు. సూర్య ఎదుర్కొన్న కష్టాలు, బాధలు, మానసిక పోరాటాలను తాను అత్యంత దగ్గర నుండి చూశానని తెలిపారు. సినిమాల్లో సవాళ్లు సాధారణమే అయినప్పటికీ, మానసిక పోరాటాలు వేరే స్థాయిలో ఉంటాయని, వాటిని అధిగమించిన సూర్యను చూస్తుంటే తనకు ఎంతో గర్వంగా ఉందని చెప్పారు.సూర్యను తన సొంత కుటుంబ సభ్యుడిగా భావిస్తానని రాధిక పేర్కొన్నారు. సూర్య ఎక్కువగా మాట్లాడే వ్యక్తి కాదని, మనసులోని భావాలను చాలా అరుదుగా కొందరితో మాత్రమే పంచుకుంటారని తెలిపారు. అలా సూర్య మనసు విప్పి మాట్లాడే ఆ కొద్దిమంది సన్నిహితుల్లో తాను ఒకరినని, ఆయనకు అప్పుడప్పుడు సలహాలు కూడా ఇస్తుంటానని వెల్లడించారు.

ఇటీవల జరిగిన మరొక కార్యక్రమంలో సూర్య కూడా రాధికతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. తన సోదరుడు కార్తి అమెరికాలో చదువుకోవడానికి వెళ్లే క్రమంలో రాధిక ఆర్థిక సహాయం చేశారని, ఆ మేలును తమ కుటుంబం జీవితాంతం గుర్తుపెట్టుకుంటుందని సూర్య కృతజ్ఞతలు తెలిపారు.వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. కేవలం ఐదు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 150 కోట్లకు పైగా వసూళ్లను సాధించి, తమిళంలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల జాబితాలో నిలిచింది.

# ఎందుకమ్మా ఏడుస్తున్నావని అడిగేవారు లేరు: నటి శ్రీలక్ష్మి



శ్రీలక్ష్మి .. వెండితెరపై దశాబ్దాలుగా హాస్యాన్ని పరుగులు తీయిస్తున్న గొప్ప నటి. 1980లో తెలుగు తెరకు పరిచయమైన శ్రీలక్ష్మి, అప్పటి నుంచి ఎన్నో విభిన్నమైన .. విలక్షణమైన పాత్రలను పోషిస్తూ వెళుతున్నారు. ఆమె చేసిన కొన్ని పాత్రలను ప్రేక్షకులు ఎప్పటికీ మరిచిపోలేరు. తరాలు మారుతున్నా, తన జోరును కొనసాగిస్తూనే ఉన్నారు. అలాంటి శ్రీలక్ష్మి తాజాగా 'సుమన్ టీవీ'తో మాట్లాడుతూ, తనకి సంబంధించిన అనేక విషయాలను గురించి ప్రస్తావించారు." నేను సినిమాలలోకి వస్తాననిగానీ .. ముఖ్యంగా హాస్యనటిగా పేరు తెచ్చుకుంటాననిగాని ఎంత మాత్రం ఊహించలేదు. మా ఫాదర్ చనిపోవడంతో, కుటుంబాన్ని నడపవలసిన బాధ్యత నాపై పడింది. అందువలన తప్పనిసరి పరిస్థితులలో నటనను మార్గంగా ఎంచుకోవలసి వచ్చింది. ఈ పాత్రను శ్రీలక్ష్మిగారైతే చాలా బాగా చేస్తారని దర్శకులు అనుకునే స్థాయికి రావడం కోసం చాలా కష్టాలు పడవలసి వచ్చింది. ఇంతకాలం నిలదొక్కుకోవడం వెనుక, ప్రేక్షకుల అభిమానం .. భగవంతుడి అనుగ్రహం ఉన్నాయనే నమ్ముతాను" అని అన్నారు. "జీవితంలో బాధ్యతలు మోయడంలోనే చాలా సమయం గడిచిపోయింది. ఒంటరిగా మిగిలిపోయానే అనే ఒక ఆలోచన అప్పుడప్పుడు వస్తూనే ఉంటుంది .. బాధను కలిగిస్తూనే ఉంటుంది. అలాంటి ఆలోచన వచ్చినప్పుడు, స్నేహితురాళ్లతో కలిసి సరదాగా బయటికి వెళతాను. ఎందుకంటే ఎందుకు ఏడుస్తున్నావని అడిగేవారే లేనప్పుడు బాధపడుతూ కూర్చుని ప్రయోజనం లేదు. జీవితం దేవుడిచ్చిన ప్రసాదం .. అందువల్లనే ఆత్మహత్యకి సంబంధించిన ఆలోచనలు ఎప్పుడూ రానీయలేదు" అని చెప్పారు.

# బీచ్‌లో దేవియాని శర్మ హాట్ లుక్స్..




తెలుగు ప్రేక్షకులకు వెబ్ సిరీస్‌లు, సినిమాల ద్వారా సుపరిచితమైన బోల్డ్ బ్యూటీ దేవియాని శర్మ తన లేటెస్ట్ ఫొటోషూట్‌తో ఇంటర్నెట్‌లో మంటలు పుట్టిస్తోంది. సముద్ర తీరంలో తీసిన ఒక డ్రామాటిక్ అండ్ బోల్డ్ పిక్‌ను పంచుకోవడంతో అది సోషల్ మీడియాలో విపరీతంగా హల్‌చల్ చేస్తోంది. బీచ్ ఒడ్డున ఉన్న రాతి గుహల మధ్య దేవియాని ఇచ్చిన హాట్ అండ్ బోల్డ్ పోజులు చూసి నెటిజన్లు గుండెజారేలా కామెంట్లు పెడుతున్నారు. ఆమె అందాలకు ఫిదా అవుతూ ఫ్యాన్స్ ఈ పిక్స్‌ను తెగ వైరల్ చేస్తున్నారు. రాతి గుహల్లో రఫ్ అండ్ హాట్ అవతార్: సముద్రం ఒడ్డున ఉన్న చీకటి రాతి గుహ నేపథ్యం (కేవ్) లో దేవియాని ఈ బోల్డ్ ఫొటోషూట్ చేశారు. క్యామోఫ్లేజ్ ప్రింటెడ్ బికినీ టాప్, నల్లటి మెష్ సరోంగ్ (నెట్ స్కర్ట్) ధరించి ఆమె ఇచ్చిన పోజులు సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. ఇక తడిసిన జుట్టు, కాళ్లకు చెప్పులు కూడా లేకుండా తడి రాళ్లపై నిలబడి, కళ్లతోనే మత్తెక్కిస్తూ రా అండ్ బోల్డ్ లుక్‌తో అందరినీ ఆకట్టుకున్నారు. మోడలింగ్ నుంచి సినిమాల వరకు: 1993 మే 30న న్యూఢిల్లీలో జన్మించిన దేవియాని శర్మ, మోడలింగ్ మరియు థియేటర్ ఆర్టిస్ట్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించారు. 2016లో 'లవ్‌షుదా' అనే హిందీ సినిమా ద్వారా వెండితెరకు పరిచయమయ్యారు. వెబ్ సిరీస్‌లతో ఊహించని పాపులారిటీ: సినిమాల కంటే వెబ్ సిరీస్‌లే దేవియానికి విపరీతమైన క్రేజ్ తెచ్చిపెట్టాయి. ముఖ్యంగా 'సైతాన్' (2023) సిరీస్‌లో జయప్రద పాత్రలో ఆమె చూపించిన బోల్డ్ నటన యూత్‌ను బాగా ఆకట్టుకుంది. అలాగే సూపర్‌హిట్ సిరీస్ 'సేవింగ్ ది టైగర్స్' లో రేఖ పాత్రలో నటించి అందరి మెప్పు పొందారు. ఇక ఇవే కాకుండా 'ఝాన్సీ', 'అనగనగా' వంటి సిరీస్‌లలోనూ ఆమె కీలక పాత్రలు పోషించారు. చేతిలో క్రేజీ ప్రాజెక్టులు ప్రస్తుతం దేవియాని శర్మ వరుస ఆఫర్లతో ఫుల్ బిజీగా ఉన్నారు. ఇటీవల తమిళంలో 'ద్రౌపతి 2' సినిమా ద్వారా కోలీవుడ్ ఎంట్రీ ఇస్తుండగా, తెలుగులో '28 డిగ్రీ సెల్సియస్' మరియు 'సేవింగ్ ది టైగర్స్' సీజన్లలో నటించింది. ఇక డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లతో పాటు సినిమాల్లోనూ వైవిధ్యమైన పాత్రలు ఎంచుకుంటూ తన కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తున్నారు. తనలోని బోల్డ్‌నెస్‌తో పాటు నటనతోనూ ఆకట్టుకుంటున్న దేవియాని శర్మ, సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉంటూ అభిమానులను అలరిస్తున్నారు. ఇక రాబోయే రోజుల్లో మరిన్ని క్రేజీ ప్రాజెక్ట్‌లతో అలరిస్తూ హీరోయిన్‌గా మంచి స్థాయికి చేరుకోవాలని కోరుకుందాం.

# రామ్ చరణ్ అన్నతో సినిమా చేయాలని ఉంది: వరుణ్ తేజ్



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ తన సోదరుడు, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్‌తో కలిసి వెండితెరను పంచుకోవాలన్న తన ఆకాంక్షను వెల్లడించారు. ఇటీవల 'కొరియన్ కనకరాజు' చిత్రంతో విజయాన్ని అందుకున్న ఆయన, ఆ సంతోషాన్ని పంచుకుంటూ తన కెరీర్, భవిష్యత్ ప్రాజెక్టులకు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.గత ఐదేళ్లుగా ఆశించిన స్థాయిలో విజయాలు లేకపోవడంతో కొంత ఒత్తిడికి లోనయ్యానని, అయితే 'కొరియన్ కనకరాజు' చిత్రానికి ప్రేక్షకుల నుంచి లభించిన ఆదరణతో ఇప్పుడు ఎంతో ఊరటగా ఉందని వరుణ్ పేర్కొన్నారు. కేవలం ఒకే తరహా జోనర్‌లకు పరిమితం కావడం తనకు ఇష్టం ఉండదని, నటుడన్నవాడు ఏ పాత్రలోనైనా పరకాయ ప్రవేశం చేయాలని తాను నమ్ముతానని చెప్పారు. కరోనా అనంతర కాలంలో ఓటీటీ ప్రాధాన్యత పెరిగినప్పటికీ, థియేటర్‌లకు వచ్చే ప్రేక్షకులకు ఒత్తిడిని దూరం చేసేలా స్వచ్ఛమైన వినోదాన్ని అందించడం ఎంతో కీలకమని తాను గ్రహించినట్లు వివరించారు.త్వరలో విడుదల కానున్న స్పోర్ట్స్ డ్రామా 'బరి' గురించి ప్రస్తావిస్తూ, గతంలో తాను చేసిన 'గని' చిత్రంలో అనేక అంశాలను జోడించడం వల్ల కొంత గందరగోళం ఏర్పడిందని, అయితే 'బరి' మాత్రం పూర్తి క్రీడా నేపథ్యంతో ఎంతో వాస్తవికంగా ఉంటుందని వరుణ్ తేజ్ భరోసా ఇచ్చారు. ఈ చిత్ర ఆలోచన తన సోదరి నిహారిక నుంచి వచ్చిందని తెలిపారు. దీనితో పాటు, ప్రముఖ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో ఒక రొమాంటిక్ చిత్రానికి అంగీకరించానని, తన వయసుకు తగినట్లుగా ఉండే ఈ ప్రేమకథ విభిన్న శైలిలో ఉంటుందని వెల్లడించారు.రామ్ చరణ్ గురించి మాట్లాడుతూ, "చరణ్ అన్నయ్య అగ్ర కథానాయకుడు. తన సినిమాల కోసం ఆయన పడే శ్రమను చూసి నేను ఎంతో స్ఫూర్తి పొందుతుంటాను. చరణ్ అన్నతో కలిసి ఒక సినిమా చేయాలన్నది నా కోరిక" అని తన మనసులోని మాటను బయటపెట్టారు. తాను చిత్ర పరిశ్రమలోకి దర్శకుడు కావాలనే లక్ష్యంతో అడుగుపెట్టానని, భవిష్యత్తులో ఆ దిశగా తప్పకుండా అడుగులు వేస్తానని వరుణ్ తేజ్ స్పష్టం చేశారు.







